అధికారంలోకి రాగానే మేనిఫెస్టో అమలు : టిడిపి

కడప అర్బన్ : టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే మినీ మేనిఫెస్టోను అమలు చేసి తీరుతామని టిడిపి జిల్లా అధికార ప్రతినిధి మన్నూరు అక్బర్ పేర్కొన్నారు. శనివారం రామనపల్లెలో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 25 సంవత్సరాలపై నుంచి కమలాపురం నియోజకవర్గ ప్రజలకు సేవలందిస్తున్న టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు పుత్తా నరసింహా రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మాహా శక్తి పథకం, తల్లికి వందన ద్వారా రూ.15000, 18 సంవత్సరాలు నిండిన మహిళకు రూ.1500, సంవత్సరానికి 3 సిలిండర్లు, ప్రతి మహిళకు బస్సుల్లో వారి వారి జిల్లాలలో ఉచిత ప్రయాణం, రైతులకు అన్న దాత పథకం ద్వారా రూ.20,000, బీసీలకు రక్షణ చట్టం, నిరుద్యోగులులకు నిరుద్యోగ భృతి,20 లక్షల ఉద్యోగాలు కల్పన, పేదలను పేద నుంచి ధనికులుగా మార్చడానికి కృషి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో యూనిట్ ఇన్‌ఛార్జి కొప్పోలు కృష్ణా రెడ్డి, టిడిపి నాయకులు ముండ్ల నరసింహా రెడ్డి, సుబ్రహ్మణ్యం, మజ్ను, షేక్ బాషా భాయ్, బాలుడు, సిద్దయ్య, బాబు, కరీం, మస్తాన్ పాల్గొన్నారు.

కరువు.. ఏకరువు!

ఎన్నికలొస్తున్నాయ్..రోడ్లేయండి మహాప్రభో

కలెక్టర్‌ను శరణుజొచ్చిన ఎంపిపి, జడ్‌పిటిసిలు

ఎంపీలు, ఎమ్మెల్యేలు డుమ్మా

నాలుగు తీర్మానాలు ఏకగ్రీవం

ఉమ్మడి వైఎస్ఆర్ జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం కరువు పరిస్థితులపై ఏకరువు పెట్టింది. శనివారం చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. 2023-24 ఖరీఫ్, రబీ సీజన్‌ల్లో వర్షాభావం నెలకొన్న నేపథ్యంలో జిల్లాలోని ప్రజాప్రతినిధులు హాజరై అర్థవంతమైన చర్చ చేసి, జిల్లాకు రావాల్సిన నిధులు, ఇతర వ్యవహారాలను రాబట్టుకోవాలి. ఇటువంటి కనీస ప్రయత్నం చేయకుండా తుపాన్, వరదలు, వర్షాభావానికి రైతులను గాలికొదిలేయడం బాధ్యతా రాహిత్యమనే చెప్పాలి. ప్రతిపక్ష టిడిపి ఎంఎల్‌సి, జడ్‌పిటిసి, ఎంపిపిలకు అవకాశం దొరికినప్పటికీ సమర్ధవంతమైన పాత్ర పోషించకపోవడం మైనస్‌గానే చెప్పకోవాలి. కడప, రాజంపేట ఎంపీలు, ప్రొద్దుటూరు, మైదుకూరు, జమ్మలమడుగు, బద్వేల్ ఎమ్మెల్యేలకు సైతం ప్రజాసమస్యలు, బాధలు, పట్టలేదు.

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని కోరుతూ వీరపునాయునిపల్లి జడ్‌పిటిసి తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి ఎంఎల్‌సి రామగోపాల్‌రెడ్డి స్పందిస్తూ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించకపోవడానికి గల కారణాలేమిటని, అధికారుల తప్పిదమా, ప్రభుత్వ తప్పిదమా అనేది తేల్చాలని నిలదీయడంతో గందరగోళం నెలకొంది. పొరుగు జిల్లాలైన కర్నూలు, అనంతపురం జిల్లాల్లో కేంద్ర ప్రభుత్వ గైడ్‌లెన్స్‌లోని ఐదు పారా మీటర్లలో మూడు పారామీటర్లు సరిపోలితే కరువు ప్రాంతంగా ప్రకటించే అవకాశం ఉందన్నారు. ఫలితంగా పంట రుణాల రీషెడ్యూల్ కావడం, ఉపాధి పనుల సంఖ్య పెరగడం వంటి ఫలితాలు లాభించే అవకాశం ఉందన్నారు. దీనిపై డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ వాస్తవాలు తెలుసుకుని మాట్లాడాలని సూచించారు. టిడిపి ప్రభుత్వ హయాంలో ఇన్సూరెన్స్ కోసం ధర్నాలు చేయాల్సి వచ్చిందని గుర్తు చేశారు. కమలాపురం ఎంఎల్ఎ రవీంద్రనాథరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో నాలుగేళ్లుగా సమృద్ధిగా వర్షాలు కురిశాయన్నారు. జిల్లా వ్యవసాయఅధికారి మాట్లాడుతూ జిల్లాలో డ్రై స్పెల్స్ కారణంగా రైతులు సకాలంలో విత్తలేక పోయారన్నారు. కడప, కమలాపురం, జమ్మలమడుగు, పులివెందుల డివిజన్లలో 11 వేల హెక్టార్లలో వర్షాభావం కొనసాగుతోందన్నారు. తాజా మిచౌంగ్ తుపాన్ కారణంగా 26 మండలాల పరిధిలోని 119 గ్రామాల్లో పంట నష్టం వాటిల్లిందని చెప్పారు. ప్రభుత్వ ఆదేశాలు అందగానే పూర్తిస్థాయి నివేదికను రూపొందించి, ఆర్‌బికెల్లో మూడ్రోజులపాటు ప్రదర్శనకు ఉంచుతామన్నారు. రైల్వేకోడూరు ఎంఎల్ఎ కొరముట్ల శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని రాజంపేట, రైల్వేకోడూరు తుపాన్ బారిన పడుతుండడం పరిపాటిగా మారిందని, ఎన్యూమరేషన్ విషయంలో 30 శాతం నిబంధన మేర పకడ్బందీగా చేపట్టాలన్నారు. ఇ-క్రాప్ చేయని పంట నష్టాలను కూడా ఎన్యుమరేషన్ చేసి వివరాలను దగ్గర ఉంచుకోవాలని సూచించారు. చక్రాయపేట జడ్‌పిటిసి మాట్లాడుతూ వరద పరిహారం చెల్లించడంపై తీర్మానం చేయాలని డిమాండ్ చేశారు. రుణమాఫీ చేసే అవకాశాన్ని ప్రతిపాదించాలని చెప్పారు. కలెక్టర్ విజయ్‌రామరాజు స్పందించి ఎన్యూమరేషన్ చేసిన అనంతరం ఆర్‌బికెల దగ్గర మూడ్రోజులపాటు ప్రదర్శనకు ఉంచాలని చెప్పారు. వేంపల్లి ఎంపిపి రవికుమార్‌రెడ్డి మాట్లాడుతూ వేంపల్లి ఆస్పత్రిలో నిపుణులైన వైద్యులు అందుబాటులో ఉన్నారని, ఆధునిక పరికరాల కొరత కారణంగా కంటి, గర్భిణీ సంబంధిత సమస్యలకు ఆపరేషన్ చేసే అవకాశం లేకుండా పోయిందన్నారు. ఎంఎల్‌సి రామ్‌గోపాల్‌రెడ్డి స్పందించి రాజంపేట ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ రోగులు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు తెలుస్తోందని, డయాలసిస్ పరికరాలతో కూడిన ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తే ప్రయోజనం ఉంటుందని తెలిపారు. బి.మఠం జడ్‌పిటిసి మాట్లాడుతూ డ్వామా ఆధ్వర్యంలోని రూ.40 కోట్లతో గ్రావెల్‌రోడ్లు నిర్మించాలని, త్వరలో ఎన్నికలు రానున్న నేపథ్యంలో సద్వినియోగం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. కలెక్టర్ స్పందించి మండలానికి రూ.50 నుంచి రూ.60 లక్షల వరకు నిధులు కేటాయిస్తామని తెలిపారు. గ్రామాలకు వెళ్లడానికి రోడ్లు సక్రమంగా లేవని, ఎన్నికల నేపథ్యంలో పల్లెలకు వెళ్తే నిలదీసే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చక్రాయపేట జడ్‌పిటిసి స్పందిస్తూ చిన్నచిన్న సమస్యల కారణంగానే పల్లెలకు వెళ్లలేకపోతున్నామని, కలెక్టరే స్వయంగా రోడ్లు పలు ఇతర సమస్యల్ని పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. బి.మఠం ఎంపిపి వీర నారాయణరెడ్డి మాట్లాడుతూ రెండు నెలల్లో ఎన్నికలొస్తున్నాయని, రేకులకుంటలో 300 ఇళ్లస్థలాల స్వీకరణకు లబ్ధిదారులు నిరాకరిస్తున్నారని, ఇతర ప్రాంతానికి ప్లాన్ మార్చాలని విజ్ఞప్తి చేశారు. బద్వేల్-ముత్తుకూరు, బద్వేల్-బి.మఠం, మైదుకూరు- వెంకటాపురం టిజిపి రహదారి సమస్య, నీటి వృథా చేయడం వంటి అంశాల ఎంపిపి, జడ్‌పిటిసి ఆందోళన వ్యక్తం చేశారు. అనంతరం వరద పరిహారం చెల్లింపు, జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని, అరటికి బీమా సదుపాయం, నరేగాలో గ్రావెల్‌రోడ్ల నిర్మాణానికి సంబంధించిన తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సమావేశంలో ఉమ్మడి జిల్లాకు చెందిన ఎంపిపిలు, జడ్‌పిటిసిలు, ఎంఎల్‌సి రమేష్‌కుమార్ యాదవ్, పలు కార్పొరేషన్ల చైర్మన్‌లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

జడ్‌పి సమావేశంలో మాట్లాడుతున్న డిప్యూటీ సిఎం అంజాద్‌బాషా

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి జి.చంద్రశేఖర్

ప్రజాశక్తి- జమ్మలమడుగు రూరల్

ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎస్‌పి జూనియర్ కళాశాలలో పార్టీ విస్తృత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు, పేదలు, కార్మికులు, సామాన్య ప్రజల ప్రయోజనాలను నరేంద్ర మోడి ప్రభుత్వం కార్పొరేట్లకు కట్టబెట్టడాన్ని వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులలోని లక్షల కోట్ల రూపాయలను కార్పొరేట్లకు ఉదారంగా అందజేస్తూ, ఈ తొమ్మిది ఏళ్ల కాలంలో దాదాపు రూ.12 లక్షల కోట్ల రుణాలను రైటాఫ్ పేరుతో రుణమాఫీ చేసిందని చెప్పారు. వ్యవసాయ సంక్షోభం ఫలితంగా అప్పుల ఊబిలో కూరుకు పోయి ఆత్మహత్యలు చేసుకుంటున్న రైతుల రుణాలు మాఫీ చేయడానికి మోడీ, జగన్ ప్రభుత్వానికి చేతులు రావడం లేదన్నారు. కార్పొరేట్ కంపెనీల రుణాలు మాఫీ చేయడం కాదు, రైతుల రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ నిబంధనలను ఉల్లంఘిస్తూ ఓడరేవులు, ఎయిర్ పోర్టులు, విద్యుత్ సంస్థలు, రైల్వే, బొగ్గు గనులు, చివరకు ఆదివాసి, గిరిజనుల అటవీ భూములపై హక్కులను హరిస్తూ తాజాగా అటవీ చట్టానికి సవరణ పాస్ చేసిందని విమర్శించారు. ఈ చర్యలన్నీ కార్పొరేట్లకు ప్రత్యేకంగా మోడీ మానస పుత్రుడు గౌతమ్ అదానీని ప్రపంచ కుబేరులలో మొదటి స్థానానికి చేర్చేందుకు దోహదపడ్డాయన్నారు. సామాన్య ప్రజలపైన పన్నుల భారాన్ని పెంచుతూ, కార్పొరేట్లకు ఐటి, ఎక్సైజ్, కస్టమ్స్, కార్పొరేట్ టాక్స్‌ల పైన లక్షలాది కోట్ల రూపాయల రాయితీలను ఇస్తోందని చెప్పారు. కార్మికుల హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకు వచ్చిందన్నారు. ఫలితంగా బలహీన వర్గాల ప్రజల ఉపాధికి నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్లకు లాభాలు పెంచి ప్రజల సంపదలు లూటీ చేస్తున్న కార్పొరేట్లను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం కడప ఉక్కుపై దుర్మార్గంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. విభజన చట్టంలో స్పష్టంగా రాష్ట్రానికి కడప ఉక్కును చట్టబద్దంగా కేటాయించినా కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం మాత్రం కడప ఉక్కును ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తోందని వాపోయారు. కడప ఉక్కు ఇక్కడి ప్రజల చిరకాల కోరికన్నారు. విద్యార్థి, యువతకు సంజీవని లాంటిదన్నారు. కడప ఉక్కు ద్వారానే ఇక్కడి యువతకు ఉద్యోగ ఉపాధి సాధ్యం అన్నారు. పార్లమెంటు సాక్షిగా నిస్సిగ్గుగా కడప ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సాధ్యం కాదని కేంద్రం చెప్పడం ఘోరం అన్నారు. కానీ పార్లమెంటులో మన ఎంపీలు దీని పై ఖండించకపోవడం మరింత దారుణం అన్నారు. రాష్ట్రంలోని వైసిపి, టిడిపి కడప ఉక్కు పై స్పష్టమైన వైఖరి తెలపాలన్నారు. అలా కాకుండా ఓటు బ్యాంకు రాజకీయంగా కడప ఉక్కును వాడుకుంటే మాత్రం ఇక్కడి ప్రజలలో చరిత్రహీనులుగా నిలిచిపోతారన్నారు. పార్లమెంటులో కేంద్రాన్ని నిలదీయాలన్నారు. కడప ఉక్కు కోసం ఎంపీలు రాజీనామా చేయాలని అన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కార్యవర్గ సభ్యుడు బెల్లం మనోహర్, నూతన పార్టీ కమిటీ సభ్య లను ఎన్నుకున్నారు. పార్టీ పట్టణ కార్యదర్శి గోపాలదాస్. ఏసుదాస్, దాసరి విజయ్‌కుమార్, ఎ.వినయ్ కుమార్, భాగ్యమ్మ, నరేంద్ర, హుస్సేన్‌వలి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సమావేశానికి పార్టీ సభ్యులు, దివాకర్, కమల్‌బాష, ఆదాము, ప్రభాకర్, దస్తగిరి, హాజీ వలి పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం జిల్లా కార్యదర్శి జి. చంద్రశేఖర్

జాతీయ లోక్ అదాలత్‌లో 3,168 కేసులు పరిష్కారం

- జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.శ్రీదేవి

ప్రజాశక్తి-కడప

జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాపితంగా నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 3,168 కేసులు పరిష్కారమయ్యాయని జిల్లా ప్రధాన న్యాయమూర్తి పేర్కొన్నారు. శనివారం కడప జిల్లా కోర్టులో నిర్వహించిన లోక్ అదాలత్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలోని కడపలో 6, ప్రొద్దుటూరులో 3, రాజంపేటలో 1, రాయచోటిలో 3, బద్వేల్‌లో 2, పులివెందుల, కమలాపురం, జమ్మలమడుగు, మైదుకూరు, లక్కిరెడ్డిపల్లి, సిద్ధవటం, నందలూరు, రైల్వేకోడూరులలో ఒకొక్కటి చొప్పున మొత్తం 23 బెంచీలు ఏర్పాటు చేశామన్నారు. లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు రాజీ అయ్యేందుకు కృషి చేసిన న్యాయవాదులకు, రెవెన్యూ సిబ్బందికి, పోలీసు, వైద్యాధికారులకు, పత్రికా సిబ్బందికి ఈ సందర్భంగా ఆమె కృతజ్ఞతలు తెలియజేశారు. కక్షిదారులకు రూ.4.227 కోట్ల మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించారని పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జడ్జిలు, న్యాయవాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీదేవి

ప్రకోపం

ప్రజా'దృష్టి'

ప్రకృతి ప్రకోపానికి రైతాంగం భారీ మూల్యం చెల్లిస్తోంది. పారిశ్రామిక, సేవల రంగాలకు ఎటువంటి ప్రమాదం లేదు. మానవుడు ప్రకృతి మీద చేసే ఆధిపత్య ప్రయత్నాలు బెడిసి కొడుతూనే ఉన్నాయి. మానవులు గుణపాఠం నేర్వడం లేదు. ప్రతి ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో అల్పపీడనాలు, ద్రోణుల పేరుతో తుపాన్‌లు చెలరేగడం కద్దు. ఇటువంటి వాతావరణ పరిస్థితులను, తుపాన్ కష్టాలను, నష్టాలను తట్టుకోవడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమష్టిగా కృషి చేస్తే నష్టాలను తగ్గించుకోవచ్చని పలు అధ్యయనాలు చెబుతూనే ఉన్నాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చెవికి సోకడం లేదు. కల్వర్టులు, చెరువుల ఆక్రమణలను అరికట్టడం, వరద ప్రభావిత ప్రాంతాల్లో శాశ్వత నిర్మాణాలు చేపట్టడం, పొలాల్లోకి చేరిన వరద కారణంగా తలెత్తే నష్టాలను తగ్గించడానికి తేమ శాతం వంటి ఆంక్షలు సడలించడం, సకాలంలో బీమా, ఇన్సూరెన్స్ వంటి సదుపాయాలను కల్పించడం వంటి భరోసానిచ్చే ప్రయత్నాలు చేపట్టాలి. ఇటువంటి పనులేవీ చేయకుండా, ఆరోగ్యకరమైన చర్చల్లో పాలుపంచుకోకపోవడం విస్మయాన్ని కలిగిస్తోంది. డబ్ల్యూటిఒ వాణిజ్య సంస్థ ఆక్షల నేపథ్యంలో రైతుల ఆత్మహత్యల పరంపర కొనసాగుతూనే ఉంది. కానీ రాజకీయ నాయకత్వాలకు రైతు ఆత్మలగోడు పట్టడం లేదు. భవిష్యత్‌లో వ్యవసాయాన్ని ప్రయోగశాలల్లో చూడాల్సి వస్తుందేమోననే భావన కలుగుతోంది. ఇటీవల మిచౌంగ్ తుపాన్ జిల్లాలో కొనసాగుతున్న వర్షాభావం పరిస్థితులకుతోడు, వరద ప్రమాదం నష్టాలను చవిచూపించింది. కరువు, వరద పరిస్థితుల తాకిడికి ఖరీఫ్, రబీ సీజన్‌లో బోర్లు, బావుల కింద సాగు చేసిన సుమారు 20 వేల ఎకరాల్లోని పంటలను సైతం వరద ముంచెత్తింది. ఫలితంగా పండిన పంటలు, కుప్పలు, నూర్పిడి దశలోని పంట వర్షార్పణమైంది. ఫలితంగా జిల్లా వ్యవసాయ రంగం కుదేలైంది. ఇటువంటి విభిన్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో రైతు జీవితం కన్నీరు సుడులు తిరుగుతోంది. ఇటువంటి పరిస్థితుల్లో రైతుకు అండగా ఉండాల్సిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు పట్టించుకున్న దాఖలాల్లేవు. మిచౌంగ్ తుపాన్ ముగిసిన వెంటనే ఉమ్మడి జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశానికి అన్నమయ్య జిల్లా నుంచి ఉన్నతాధికారులు, కడప, రాజంపేట ఎంపీలు, నలుగురు ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. జిల్లా సమ్మిళిత అభివృద్ధికి వ్యవసాయ, పారిశ్రామిక, సేవలు రంగాలు కీలకమైనవి. వ్యవసాయ రంగం ప్రాణాధారం. ఇటువంటి వ్యవసాయ రంగం ఆపదల బారిన పడినప్పుడు రాజకీయ నాయకత్వం ముందుండి భరసా ఇవ్వాలి. అటువంటి ప్రయత్నాలు చేయకుండా, వ్యాపారాలు, కార్యక్రమాలకు పరిమితం కావడం ఆందోళనకరం. మిగిలిన సమయాల్లో ఎట్లా వ్యవహరించినప్పటికీ ఎవరికి ఎటువంటి ఇబ్బంది ఉండదు. కానీ ఆపద, బాధల సమయాల్లో రైతులకు అండగా నిలవాల్సిన బాధ్యత రాజకీయ నాయకత్వాలపై ఉంది. ఇటువంటి పరిణత రాజకీయ నాయకత్వం కొరవడడం దురదృష్టకరమనే చెప్పాలి.

- ప్రజాశక్తి - కడప ప్రతినిధి

అవినీతిని అంతమొందించాలి

- ప్రజా సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు

ప్రజాశక్తి - బద్వేల్

అవినీతిని అంతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక కన్వీనర్ కె.శ్రీనివాసులు పిలుపునిచ్చారు. శనివారం అవినీతి అంతర్జాతీయ వ్యతిరేక దినోత్సవ సందర్భంగా స్థానిక సుందరయ్య భవనంలో ప్రజాసంఘాల సమావేశం నిర్వహించారు. అవినీతి అభివృద్ధికి పెనుభూతం లాంటిది పేర్కొన్నారు. అవినీతి లేని దేశాలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, ప్రస్తుతం దేశంలో అవినీతి పెరిగిపోతుందని చెప్పారు. ప్రజలు అవినీతిలో కూరకు పోయారని, అవినీతి నిర్మూలనకు ప్రతి ఒక్కరూ నిజాయితీగా అంకితభావంతో కృషిచేసి దేశ అభివృద్ధికి కృషి చేయాలని ఆయన అన్నారు. పాలకులు ఓటర్లను అవినీతిపరులుగా తయారుచేసి దేశ అభివృద్ధి నిరుద్యోగులుగా తయారు చేస్తున్నారని చెప్పారు. కొందరు ప్రభుత్వాధికారులు లంచం తీసుకోకుండా పనులు చేయడం లేదని వాపోయారు. కనీసం ప్రాజెక్టు నిర్మాణంలో పేదలకు ఉచిత నిత్యావసర వస్తువుల సరఫరాలోనూ అవినీతి రాజ్యమే లుతుందని పేర్కొన్నారు. అవినీతి నిర్మూలనకు ప్రభుత్వాలు కఠినమైన చట్టాలను చేసి అమలు చేయాలని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని, పట్టణ నాయకులు ఆంజనేయులు, సురేంద్ర, బాల గురయ్యా, సిఐటియు నాయకులు రాజగోపాల్, గంప సుబ్బరాయుడు, మహిళా సంఘం పట్టణ అధ్యక్ష కార్యదర్శులు అనంతమ్మ, రత్తమ్మ, పట్టణ నాయకులు కోటపాటి రమాదేవి, మోక్షమ్మ మస్తాన్, బి.కత్తినాగమ్మ, రవణమ్మ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ప్రజా సంఘాల నాయకులు

అవినీతి అభివృద్ధికి నిరోధకం

పట్టణంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో శనివారం అంతర్జాతీయ అవినీతి వ్యతిరేక దినోత్సవ సమావేశం సమాచార హక్కు చట్టం రక్షణ వేదిక ఆధ్వర్యాన జిల్లా ఉపాధ్యక్షులు బద్వేలు గురుమూర్తి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథులు యోగివేమన విశ్వవిద్యాలయ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు కొండపల్లి చిన్న సుబ్బారావు మాట్లాడుతూ అవినీతి అభివృద్ధికి పెనుభూతంలాటిది అవినీతి లేని దేశాలే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాయని, సభాధ్యక్షులు గురుమూర్తి మాట్లాడుతూ పాలకులు ఓటర్లను అవినీతిపరులుగా తయారుచేసి దేశ అభివృద్ధి నిరోధకులుగా తయా రైనారు. కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ బద్వేలు పట్టణ అధ్యక్షులు ఎస్.ఎ. సత్తార్, బి.సి చైతన్య సమితి రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు బిసి రమణ, సిపిఐ సీనియర్ నాయకులు వెంకట సుబ్బయ్య, జి.శ్రీనివాసులు కన్జ్యూమర్స్, హ్యూమన్ రైట్స్ రాష్ట్ర అధ్యక్షులు సి.నారాయణ, అంబేద్కర్ భవన అభివృద్ధ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు జకరయ్య, కేశవ, యు.మునెయ్య, రిటైర్డ్ ఎంఇఒ రామసుబ్బయ్య, డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి జి.నాగార్జున, జాతీయ బి.సి సంక్షేమ సంఘ జిల్లా వర్కింగ్ అధ్యక్షులు రమణ యాదవ్, డి.బి.ఎఫ్ రాష్ట్ర నాయకులు చిన్నయ్య, ఎంఆర్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు శిఖామణి, బిసి సంఘ నాయకులు రంగరాజు, శివరామయ్య, ఆవాజ్ కమిటీ సభ్యులు కె.బి రసూల్, ఖాజాగౌస్, లెక్చరర్లు రవిబాబు,శ్రీనివాసులు, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత షేక్ మహబూబ్ సాహెబ్ ఉపాధ్యాయులు మురళీకృష్ణ పాల్గొన్నారు.

పేదలకు పింఛను, కూరగాయలు అందజేస్తున్న అబ్దుల్ సుభాన్

వృద్ధులకు పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి -ఒంటిమిట్ట

మండల పరిధిలోని మలకాటిపల్లి మదరసాలో నూరుల్లా ట్రస్ట్ అధినేత అబ్దుల్ సుభాన్ విభిన్న ప్రతిభాంతులకు, వృద్ధులకు, పేదలకు ఒకొక్కరికీ రూ.500 చొప్పున శనివారం పింఛన్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాను చాలా కాలం నుంచి పేదలకు, వృద్ధులకు, వికలాంగులకు సొంత డబ్బు వెచ్చించి ప్రతినెలా పింఛన్ల రూపంలో పేదలకు సాయం చేస్తు న్నామని చెప్పారు. తాను ఆయుర్వేద వైద్యుడిగా ఉన్నానని, మండ లంలోగాక జిల్లా అంతగా ఉచితంగా అన్ని రకాల వ్యాధులకు మం దులు ఉచితంగా పంపిణీ చేస్తున్నామని చెప్పారు. త్వరలో అయు ర్వేద మేళా నుంచి పేదలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందలజేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పేదలు, వృద్ధులు, వికలాంగులు పాల్గొన్నారు.

ప్రజలు ఆశీర్వదిస్తున్నారు

ప్రజాశక్తి - కడప అర్బన్

తెలుగుదేశం పార్టీని ప్రజలు ఎక్కడికి వెళ్లినా ఆశీర్వదిస్తూ ఉన్నారని టిడిపి కార్పొరేటర్ ఉమాదేవి అన్నారు. శనివారం 'బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా 15వ డివిజన్లు మేనిఫెస్టో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2024లో వచ్చేది టిడిపి ప్రభుత్వమే అని, ప్రజల నుంచి వస్తున్న స్పందనబట్టి స్పష్టంగా తెలుస్తుంది అన్నారు. అకాల వర్షాలకు నష్టపోయిన రైతాంగాన్ని టిడిపి అధినేత, మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పరామర్శించారని పేర్కొన్నారు. చేతికి వచ్చిన పంట నోటి వరకు రాలేదని రైతులు ఆవేదన చెందారని తెలిపారు. వైసిపి ప్రభుత్వం రైతాంగాన్ని ఆదుకోవడంలో విఫలమైందని విమర్శించారు. టిడిపి సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి, కడప నియోజకవర్గ మాజీ ఇంచార్జి అమీర్ బాబు, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు మన్మోహన్ రెడ్డి, దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ఎప్పుడెప్పుడు సీఎం అవుతారని ప్రజలు ఎదురుచూస్తూ ఉన్నారని చెప్పారు. జిల్లాలో పదికి పది సీట్లు సాధించే దిశగా పార్టీ బలోపేతం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు, కొండా సుబ్బయ్య, నబీకోట శీను, నజీర్, జయరామిరెడ్డి, ఓబుల్ రెడ్డి, బిసి సెల్ నగర ప్రధాన కార్యదర్శి అశోక్ కుమార్, అంబవరం రామాంజనేయులు రెడ్డి, ఇలియాస్, గౌస్ పీర్, మురళి, సుధాకర్ రెడ్డి వెంకటేష్, మీనాక్షి, స్వర్ణలత, మల్లేశ్వరి, అమరావతి పాల్గొన్నారు.



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న ఉమాదేవి

యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తాం

ప్రజాశక్తి-కలసపాడు

తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పిస్తామని తెలు గుదేశం పార్టీ నాయకులు రితీష్ రెడ్డి తెలిపారు. శనివారం కలస పాడు మండలంలోని చింతల పల్లి ప్రంచాయతీలో మూడ వరోజు పాదయాత్రలో భాగంగా ఆయన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఐదేళ్లల్లో చదువుకున్న అనేక మంది యువతీ యువకులకు ఉద్యోగ అవకాశాలు లేక అతి తక్కువ జీతాలతో జీవనోపాధి కాలం గడిపేస్తున్నారని చెప్పారు. యువతకు విద్యను మరియు ఉద్యోగ అవకాశాలను కల్పించడంలో జగన్ ప్రభుత్వం వైఫల్యం చెందిందని ఆరోపించారు. డిగ్రీ ఆపైన ఉన్నత చదువులు చదివిన వారికి వాలంటీర్, బ్రాందీ షాపులలో కంప్యూటర్ ఆపరేటర్ పోస్టులు ఇచ్చి చేతులు దులుపుకున్నారని చెప్పారు. రానున్న 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ నీ ప్రతి ఒక్కరు ఆదరించి ఓట్లు వేసి గెలిపించాలని కోరారు. ప్రభుత్వం వచ్చిన వెంటనే నిరుద్యోగులకు ఉద్యోగ భద్రత, కబ్జాకు గురైన స్థలాను అగ్రకులస్తుల నుంచి స్వాధీనం చేసుకుని పేద దళితులకు పంచు తామని చెప్పారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నియోజకవర్గ అభ్యర్థి బొజ్జరోశన్న, మార్కెట్ యార్డ్ చైర్మన్ మాజీ సాధన కారి రంతు, చింతలపల్లి సర్పంచ్ రామ సుబ్బమ్మ, తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు వెంకట్రామిరెడ్డి, ఉప మండల అధ్యక్షుడు పట్టాభి రెడ్డి, నారాయణరెడ్డి, మామిళ్ళపల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు మన్యం మల్లికార్జునరెడ్డి , భద్రయ్య, సుధాకర్, మస్తాన్ పాల్గొన్నారు.

పాదయాత్రలో ప్రజలకు నమస్కరిస్తున్న రితీష్‌రెడ్డి

కాశినాయనలో ప్రవేశించిన పాదయాత్ర

కాశినాయన : బద్వేల్ తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు రితీష్ చేపట్టిన 'పల్లె పల్లెకు మీ రితీష్' పాదయాత్ర మండల పరిధిలోని ఓబులాపురం గ్రామానికి చేరుకుంది. ఈ సందర్భంగా ఆయన ఓబులాపురంలో మాట్లాడుతూ మండలాన్ని అభివృద్ధి చేసే బాధ్యత తనదని చెప్పారు. వచ్చే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని మంచి మెజారిటీతో గెలిపించాలని కోరారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వస్తే జ్యోతి క్షేత్రంలో ఉన్నటువంటి కాశినాయన గుడి నిర్మాణం పూర్తి చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నార.ు అధికారం వస్తే పల్లె పల్లెను అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన అన్నారు. కార్యక్రమంలో టిడిపి మండల నాయకులు గురువిరెడ్డి, కోడిగుడ్లపాడు, బాలరాజుపల్లె నాయకులు శ్రీనివాసులు రెడ్డి, రవీంద్రారెడ్డి, ఉప్పులూరు మాజీ ఎంపిటిసి పోల్ రెడ్డి, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలి

కడప : సమైక్య సెమీ క్రిస్మస్ వేడుకలను జయప్రదం చేయాలని ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షులు, కార్యదర్శులు పిలుపునిచ్చారు. కడప నగరం ప్రకాష్ నగర్ లో ఉన్న సిబిటిసి ప్రార్థన మందిరంలో శనివారం ఇండిపెండెంట్ పాస్టర్స్ అసోసియేషన్ల అధ్యక్షులు, కార్యదర్శుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 11, 12, 23 తేదీల్లో సాయంకాలం 6 .30 గంటలకు స్టార్ ఫంక్షన్ హాల్‌లో ఇండిపెండెంట్ పాస్టర్స్‌తో కలసి 'సమైక్య సెమీ క్రిస్మస్ వేడుకలు' నిర్వహిస్తామన్నారు. కడప నగరంలో ఉన్న ఇండిపెండెంట్ పాస్టర్లు, వారి సంఘాల సభ్యులు, పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో కడప సిటీ పాస్టర్లు బిషప్ డానియల్ కృష్ణ దాస్, బ్రదర్ షద్రక్ రాజు, మల్లెం విజయభాస్కర్, పాస్టర్ డేవిడ్ రాజ్, పాస్టర్ పుల్లూరు శ్రీనివాసులు, పాస్టర్ పి మహేష్ , పాస్టర్ ప్రేమానందం, పాస్టర్ జాన్, పాస్టర్ విజయ శేఖర్, బిషప్ శామ్యూల్ బాబు, పాస్టర్ జాన్సన్ పాల్గొన్నారు.

రేపు మెగా జాబ్ మేళా

కడప అర్బన్ : డిఆర్‌డిఎ సీడప్, నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఈనెల 11వ తేదీన మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్టు నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ రీజినల్ కో-ఆర్డినేటర్ సుబ్బరామిరెడ్డి, ప్లేస్మెంట్ ఆఫీసర్ సాయి సునీల్ కుమార్ శనివారం ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. వైసిపి కార్యాలయం వద్ద నున్న నిహార్ మల్టీస్కిల్ డెవలప్మెంట్ సెంటర్‌లో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జాబ్ మేళాలో సుమారు 15 నుంచి 20 కంపెనీలు పాల్గొంటున్నాయని తెలిపారు. పదో తరగతి పాస్ అయిన , డిగ్రీ పూర్తి చేసిన యువతీ, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు9063082227, 9347579617లలో సంప్రదించాలని తెలిపారు.

వినతిపత్రమిస్తున్న సిఐటియు నాయకులు, కార్మికులు

వేతనాలు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులకు మూడు నెలలుగా బకాయి ఉన్న వేతనాలు మంజూరు చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి సత్యనారాయణ కోరారు. ఆ మేరకు శనివారం ఆయన ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం సత్యనారాయణ మాట్లాడుతూ పారిశుధ్య కార్మికులకు తక్కువ వేతనాలు ఇస్తున్నారని, అదీకూడా మూడు నెలలుగా ఇవ్వడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం కోర్టు తీర్పుమేరకు నెలకు రూ.16వేలు ఇవ్వాల్సి ఉందన్నారు. తక్కువ వేతనం ఇవ్వడం బాధాకరమన్నారు. త్వరలో క్రిస్మస్ పండుగ రానుందని, అదికారులు వెంటనే చొరవ తీసుకొని బకాయి వేతనాలు మంజూరు చేయాలన్నారు. కార్యక్రమంలో చెన్నారెడ్డి, కళావతి పాల్గొన్నారు.

నేడు మెగా ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలోని శ్రీచైతన్య పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహిస్తున్న మెగా ఉచిత గుండె వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని మానవత సేవా సంస్థ చైర్మన్ చక్రపాణిరెడ్డి, సంస్థ అధ్యక్షులు బాలాజీ కోరారు. ఆ మేరు వారు శనివారం విలేకరులతో మాట్లాడుతూ మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో గుండె జబ్బులున్న వారికి ఈ వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అనంతపురానికి చెందిన కిమ్స్ సవేరా హస్పిటల్ సహకారంతో నిర్వహిస్తున్నామన్నారు. జిఆర్‌బిఎస్, బిపి, ఇసిజి, 2డిఎకో పరీక్షలతోపాటు మందులు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. గుండె, ఛాతీనొప్పి, గుండె దడ, ఆయాసం, కళ్లు తిరగడం, గుండెలో మంట, ఛాతీలో బరువు ఉండడం, నిద్రలో ఆయాసం వచ్చి లేవడం, కాళ్లు వాపు రావడం, చెమటలు పట్టడం వంటి వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఉదయం 10 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య సేవలు అందిస్తున్నట్లు చెప్పారం. తమ పేర్లను 96427 57744కు ఫోన్ చేసి నమోదు చేసుకోవాలని వారు కోరారు.

సమస్యను కలెక్టర్‌కు వివరిస్తున్న అచ్చుకట్ల కరీముల్లా

రాత్రివేళల్లో ఖాజీపేటలో బస్సులు ఆపాలని వినతి

ప్రజాశక్తి - ఖాజీపేట

మండల కేంద్రమైన ఖాజీపేటలో రాత్రి వేళల్లో ఆర్‌టిసి బస్సులు ఆపాలని జడ్‌పి కో-ఆప్షన్‌మెంబర్ అచ్చుకట్ల కరీముల్లా కలెక్టర్‌ను కోరారు. ఆ మేరకు శనివారం ఆయన కడప జిల్లా పరిషత్ భవనంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ విజయ్‌రామరాజును కోరారు. రాత్రివేళ ఖాజీపేట పట్టణంలోకి ఆర్‌టిసి బస్సులు రాకపోవడం వల్ల ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారని వివరించారు. ఇందుకు సానుకూలంగా స్పందించిన అధికారులు తగు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారని కరీముల్లా తెలిపారు.

మురుగు శుద్ధి వాహనాలను పంపిణీ చేస్తున్న కలెక్టర్ విజయ్‌రామరాజు

రాయితీతో శుద్ధి వాహనాల పంపిణీ

ప్రజాశక్తి - కడప అర్బన్

స్వచ్ఛత ఉద్యమి యోజన పథకంలో భాగయిగా కడప మున్సిపల్ కార్పోరేషన్ పరిధిలో పని చేస్తున్న సఫాయి కర్మచారులకు వారి జీవనోపాధికి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ రూ. 2.53 కోట్ల విలువగల 8 మురుగునీటి శుద్ధి వాహనాలను మంజూరు చేశారు. వీటిని ఉప ముఖ్యమంత్రి ఎస్.బి.అంజాద్‌బాషా, కలెక్టర్ వి.విజయ్‌రామరాజు, జిల్లా పరిషత్ చైర్మన్ ఆకెపాటి అమర్నాథ్‌రెడ్డి శనివారం జిల్లా పరిషత్ ఆవరణలో పంపిణీ చేశారు. ఒక్కో మురుగునీటి శుద్ధి వాహనం విలువ రూ.31.67 లక్షలు. ఇందులో ప్రభుత్వ రాయితీ పోనూ రూ.16.60 లక్షలను లబ్ధిదారుడు వాయిదా పద్దతిలో కార్యనిర్వాహక సంచాలకులు, యస్‌సి కార్పోరేషన్‌కు చెల్లిస్తారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సూర్యసాయి ప్రవీణ్‌చంద్, కార్యనిర్వాహక సంచాలకులు డాక్టర్ హెచ్.వెంకట సుబ్బయ్య, ఎస్సి కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ ఎం.శ్రీనివాసులు, నగర డిప్యూటీ మేయర్ ముంతాజ్ బేగం, కార్పొరేటర్ షేక్ మగమ్మద్ షఫీ, నాయకులు జమాల్ బాషా పాల్గొన్నారు.

శాంతికి చిహ్నం క్రిస్మస్

ప్రజాశక్తి - రాయచోటి టౌన్

ప్రేమ, శాంతి, సంతోషాలకు చిహ్నం క్రిస్మస్ అని ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. శనివారం పట్టణంలోని మదనపల్లె రహదారి మార్గంలోని ఐసిసి చర్చి గ్రౌండ్ లో రాయచోటి ఫాస్టర్స్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో నిర్వహించిన సెమీ క్రిస్మస్ వేడుకలలో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఎమ్మెల్యే చేత కేక్ కట్ చేయించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కీస్తు జననం మానవాళికి శుభకరమన్నారు .క్రీస్తు బోధనలను అందరూ ఆచరించాలన్నారు. క్రిస్టియన్ల సమస్యల పరిష్కారానికి ఎంపీ మిథున్, తామూ కృషి చేస్తున్నామన్నారు. ఈ సందర్భంగా ప్రజలకు ముందస్తు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాష, వైఎస్ఆర్ సిపి నాయకుడు ఫయాజ్ అహమ్మద్ మాట్లాడుతూ రాయచోటిలో పెద్ద ఎత్తున సెమీ క్రిస్మస్ వేడుకలు జరగడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఫాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు విజయ్, ప్రభుదాస్, సునీల్, వర్మ,రాజు, డేవిడ్ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు

ప్రజాశక్తి - గాలివీడు

మండలంలోని పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి శంకుస్థానలు చేయనున్నారు. గోపనపల్లి, గుండ్ల చెరువు సచివాలయాల పరిధిలో గాలివీడు, బుట్టిగారిపల్లి, శెట్టివారిపల్లెలో సిసి రోడ్లు, వాటర్ ట్యాంకు తుముకుంట ప్రకాష్‌నగర్ కాలనీలో తారు రోడ్డు నిర్మాణాను ఆయన ప్రారంభించనున్నారు.

ఘనంగా ముగిసిన ఉరుసు

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లెలో రెండు రోజుల నుండి జరిగిన హజ్రత్ జిందేషా మదార్ షా వలి ఉరుసు ఘనంగా ముగిసింది. స్థానిక కాలేజి రోడ్డులో వెలిసిన హజ్రత్ జిందేషా మదార్ షా వలి ఉరుసును దర్గా కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా శుక్రవారం రాత్రి అనంతపురం జిల్లా యల్లనూరుకు చెందిన బాబు బీడి ఆధ్వర్యంలో ఖవ్వాలి, లైటింగ్ ఏర్పాట్లు చేశారు. మండలంలోని ఆయా గ్రామాల్లోని ప్రజలు ఉరుసు మహోత్సవంలో పాల్గొన్నారు. వారితో ఆ ప్రాంతం కిక్కిరిసిపోయింది. భారీ సంఖ్యలో మహిళలు పాల్గొని దర్గాలో ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. సిఐ చాంద్ బాషా ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. మౌషిన్ చిష్తి, షఫియా వర్సి మధ్య జరిగిన ఖవ్వాలి పోటాపోటీగా సాగడంతో ప్రజలు ఆసక్తిగా తిలకించారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు, హిందు ముస్లింలు పాల్గొన్నారు.

పాట పాడుతున్న షఫియా వర్సి

అన్నదానం సంతృప్తినిస్తుంది : 'చల్లా'

అన్నం వడ్డిస్తున్న చల్లా రాజగోపాల్

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ప్రతి పేదవానికి కడుపునిండా భోజనం పెట్టినప్పుడే తనకు ఆత్మసంతృప్తి కలుగుతుందని సీమాంధ్ర బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు, శ్రీకృష్ణాలయ యాదవ సేవా కమిటీ అధ్యక్షులు చల్లా రాజగోపాల్ పేర్కొన్నారు. స్థానిక పాత బస్టాండ్ ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్లా మాట్లాడుతూ కరోనా సమయంలో అప్పటి స్థానిక డిఎస్‌పి లోసారి సుధాకర్ సూచనమేరకు అన్నదానం చేసేందుకు ముందుకొచ్చానని తెలిపారు. అప్పటినుండి 40కిలోల బియ్యంతో 250 మందికి అన్నదానం ప్రారంభించానని తెలిపారు. నేడు వంద కిలోలతో దాదాపు వెయ్యి మందికి భోజనం పెడుతున్నానని తెలిపారు. ప్రతి పౌర్ణమి రోజున అమ్మవారి ఆలయం దగ్గర అన్న ప్రసాదం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చల్లా రవిశంకర్ యాదవ్, మూరబోయిన శ్రీనివాస యాదవ్, నల్లం రవిశంకర్, సీతంపల్లి రమణ, చంద్రబాబు, బోడెం ప్రసాద్, శివ యేసు నాథరెడ్డి, జయచంద్ర, ఈశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో సోనియా పుట్టిన రోజు వేడుకలు

ప్రజాశక్తి - వేంపల్లె

స్థానిక రాజీవ్ నగర్ కాలనీలో ఉన్న మదర్ థెరిస్సా అనాథ వృద్ధాశ్రమంలో వృద్ధులకు పిసిసి మీడియా చైర్మన్ తులసిరెడ్డి పండ్లు పంపిణీ చేశారు. ఎఐసిసి మాజీ వర్కింగ్ ప్రెసిడెంట్ సోనియా గాంధీ పుట్టిన రోజు సందర్భంగా శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తులసిరెడ్డి మాట్లాడుతూ సోనియా గాంధీ త్యాగానికి మారు పేరన్నారు. ప్రధానమంత్రి పదవిని వదులుకొన్న త్యాగశీలిగా పేర్కొన్నారు. మహత్మా గాంధీ, నెహ్రూ, నేతాజీ, పటేల్ వంటి మహానాయకులు నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్ష పదవిని 21ఏళ్లు సమర్ధవంతంగా నిర్వహించారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ధృవకుమార్ రెడ్డి, సుబ్రమణ్యం, రామకృష్ణ, ఉత్తన్న, చెన్నకేశవ, బాలం సుబ్బరాయుడు, బద్రి, రాఘవయ్య, అమర్నాథ్‌రెడ్డి, శివ, మహబూబ్ పీరా, షబానా, మాస్, వెంకటేష్, నామా వినయ్, ఆరుశేర్ల సుబ్బరాయుడు, ఆశ్రమ నిర్వాహకులు వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

వృద్ధులకు అరటి పండ్లు పంపిణీ చేస్తున్న తులసిరెడ్డి

క్రైస్తవుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

ప్రజాశక్తి - జమ్మలమడుగు

క్రైస్తవుల సంక్షేమానికి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని ఏసుక్రీస్తు సంఘం ఏడవ వార్షికోత్సవ సందర్భంగా శనివారం ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు వల్లంబాయి హృషికేశవరెడ్డి ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పాటైన వెంటనే పాస్టర్లకు గౌరవ వేతనం అందించారన్నారు. తమ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందాయని తెలిపారు. మతసామరస్యానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. హృషికేశవరెడ్డి మాట్లాడుతూ 2019 ఎన్నికల సందర్భంగా క్రైస్తవులందరూ ఏకతాటిపై నిలిచి ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్‌రెడ్డిని గెలిపించారన్నారు. రానున్న 2024 ఎన్నికల్లో మళ్లీ జమ్మలమడుగు ఎమ్మెల్యేగా డాక్టర్ సుధీర్‌రెడ్డి, కడప ఎంపీగా వైయస్ అవినాష్‌రెడ్డిని అఖండ మెజార్టీతో క్రైస్తవులు గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఏసుక్రీస్తు సంఘం చైర్మన్ పొన్నతోట జయన్న, ఏసుక్రీస్తు సంఘం పాస్టర్ బ్రదర్ ఏసయ్య, 16వ వార్డు ఇన్‌ఛార్జి మురళికృష్ణ, వైసిపి నాయకులు బోనం సురేష్, ఏసుక్రీస్తు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో ప్రసవాలు సురక్షితం

భోజనదాత నారాయణ యాదవ్‌ను సన్మానిస్తున్న వైద్య సిబ్బంది

ప్రజాశక్తి - చాపాడు

ప్రభుత్వాసుపత్రుల్లో ప్రసవాలు సురక్షితమని వైద్యాధికారి శ్రీవాణి తెలిపారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం పిఎంఎస్ఎంఎ కార్యక్రమంలో భాగంగా 80 మంది గర్భిణులకు శ్రీవాణి, డాక్టర్ ఓబులేస్ పరీక్షలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో శ్రీవాణి మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల్లో కాన్పు కావాలని సూచించారు. పోషక విలువలున్న ఆహారం తీసుకోవాలని సూచించారు. రక్తహీనతకు నివారణకు ఆకుకూరలు వినియోగించాలన్నారు. వైద్యం కోసం వచ్చిన గర్భిణులకు అల్లాడుపల్లెకు చెందిన ఎంఎస్ఎల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ మేనేజింగ్ డైరెక్టర్, రియల్ ఎస్టేట్ వ్యాపారి పెరుగు నారాయణ యాదవ్, బద్రిపల్లె టిడిపి నాయకులు, సర్పంచ్ భర్త గుత్తినారాయణ భోజన వసతిని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారిని వైద్య సిబ్బంది ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కొండపల్లి శేషగిరి, గుత్తి వీరకిషోర్ యాదవ్, పర్యవేక్షకులు రమేష్, ఎఎన్ఎంలు, వైద్య సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

పెద్దముడియం : మండలంలోని మేడిదిన్నె ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం వైద్యులు మహమ్మద్ హుస్సేన్, శ్రుతి సమక్షంలో గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వైద్యులు తగు సూచనలిచ్చారు. అవసరమైన మందులు పంపిణీ చేశారు. మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ సోము వెంకటరమణ, స్టాఫ్ నర్సులు, ల్యాబ్ టెక్నషియన్లు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

వైద్యుల సలహాలను పాటించాలి

ప్రొద్దుటూరు : గర్భిణులు వైద్యుల సలహాలు పాటించాలని ప్రముఖ గైనకాలజిస్ట్ డాక్టర్ వల్లంకొండు అనూష సూచించారు. సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వైయంఆర్ కాలనీ పట్టణ ప్రాథమిక అరోగ్య కేంద్రంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె గర్భిణులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. ఆరోగ్య వైద్యాధికారి డాక్టర్ హిమబిందు మాట్లాడుతూ ప్రతి నెల 9న ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ ఆర్గనైజర్ యం.వి.సుబ్బారెడ్డి ఆరోగ్య కార్యదర్శులు, ఆషాలు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రొద్దుటూరులో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

పూర్వ విద్యార్థుల కలయిక అభినందనీయం

గురువును సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి - సింహాద్రిపురం

పూర్వ విద్యార్థులు కలుసుకొని తమ చిన్ననాటి జ్ఞాపకాలు నెమరు వేసుకోవడం అభినందనీయమని పులివెందుల రూరల్ సీఐ బాలమద్దిలేటి పేర్కొన్నారు. మండల పరిధిలోని బి.చెర్లోపల్లె ప్రాథమిక పాఠశాలలో మా బడికి నూరేళ్ల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్వ విద్యార్థుల కలయిక అపూర్వమన్నారు. పూర్వ విద్యార్థులు తమ గురువులను ఘనంగా సన్మానించారు. పాఠశాల అభ్యున్నతికి గ్రామానికి చెందిన గోపాల్‌రెడ్డి రూ.50 వేలు విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఐ రోషన్, సర్పంచ్ గంగయ్య, ఎంపీటీసీ మనోహర్‌రెడ్డి, గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సచివాలయం ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

సచివాలయ వ్యవస్థ కీలకం

ప్రజాశక్తి - పెద్దముడియం

ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అనేక సేవలు అందించడంలో సచివాలయ వ్యవస్థ ఎంతో కీలకమని ఎమ్మెల్యే డాక్టర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొండసుంకేశులలో శనివారం నూతన సచివాలయం, పలు ప్రభుత్వ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రజా సంక్షేమమే ధ్యేయంగా సచివాలయాలు పనిచేస్తున్నాయన్నారు. రైతు భరోసా కేంద్రాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు ఏర్పాటయ్యాయని తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కొండ సుంకేశులలో ఎన్నో ఏళ్లుగా అసైన్డ్ భూమిని సాగు చేసుకుంటున్న రైతులకు ఎమ్మెల్యే పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో నంద్యాల ఎమ్మెల్యే రవి కిషోర్‌రెడ్డి, ఆత్మకూరు ఎమ్మెల్యే చక్రపాణిరెడ్డి కుమారుడు కార్తీక్‌రెడ్డి, జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ మలికిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, వైసిపి యువ నాయకులు మలికిరెడ్డి హనుమంతరెడ్డి, స్థానిక పార్టీ నాయకుడు భాస్కర్‌రెడ్డి, తహశీల్దార్ జ్యోతి రత్నకుమారి, ఎంపిడిఒ వెంకటరమణయ్య, ఎస్ఐ రామకృష్ణ, సచివాలయ సిబ్బంది, ఆశా వర్కర్లు, భూ పట్టా లబ్ధిదారులు, నాయకులు. కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

నేటి వనభోజనాలను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

గూడూరు గురుప్రసాద్

పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డులో నూతనంగా నిర్మిస్తున్న బలిజ సంఘ కలాంమ ఐ మండపంలో కార్తీక మాసాన్ని పురస్కరించుకొని ఆదివాకం బలిజ సోదరులు, కుటుంబ సభ్యులకు వనభోజ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం అధ్యక్షుడు గూడూరు గురుప్రసాద్ తెలిపారు. ఆ మేరకు ఆయన శనివారం మాట్లాడుతూ బలిజలు తమ కుటుంబ సభ్యులతో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఏడాదికో దూడ రైతులకు లాభదాయకం

ప్రజాశక్తి - చాపాడు

పశువుల్లో ఏడాదికి ఒక దూడ రైతులకు లాభదాయకమని వెదురూరు పశువైద్యాధికారి సి.విజయ్‌కుమార్ తెలిపారు. మండల పరిధిలోని నరహరిపురం గ్రామంలో శనివారం రిలయన్స్ ఫౌండేషన్, పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడాదికి ఒక దూడను పొందేలా పశువులను పెంచుకోవాలన్నారు. అందుకు తగిన పోషణ యాజమాన్య మెలకువలను రైతులకు వివరించారు. సంవత్సరానికి కనీసం రెండుసార్లు పశువులన్నింటికీ నట్టల నివారణ మందులు తాపించాలన్నారు. ఈ పశు వైద్య శిబిరంలో 200 జీవాలకు నట్టల నివారణ మందులు, 25 పశువులకు సాధారణ పరీక్షలు, 20 పశువులకు గర్భకోశ పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధి అమీర్, పశుసంవర్ధక శాఖ సిబ్బంది లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు

రక్తగ్రూపు నిర్ధారణ ప్రయోజనకరం

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షలు ఎంతో ఉపయోగకరమని ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల (మెయిన్)లో స్నేహిత అమృత హస్తం సేవాసమితి అధ్యక్షులు రాజు ఆధ్వర్యంలో శనివారం విద్యార్థులకు రక్తగ్రూపు నిర్ధారణ పరీక్షల శిబిరాన్ని ఏర్పాటు చేశారు. దీన్ని ఎంఇఒ శ్రీనివాస్‌రెడ్డి, రాజు ప్రారంభించారు. శిబిరంలో కోవరగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ల్యాబ్ టెక్నీషియన్ శ్రావణి, నగరి గుట్ట, బాకరాపురం పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ల్యాబ్ టెక్నీషియన్‌లు సురేష్, సంపత్ కుమార్, రక్తనిధి ల్యాబ్ టెక్నీషియన్ మహమ్మద్ రఫీ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, నేత్రనిధి టెక్నీషియన్ హరీష్, సభ్యులు పాల్గొన్నారు.

అల్లాడుపల్లె ధర్మకర్తల మండలి నియామకానికి ఉత్తర్వులు

ప్రజాశక్తి - చాపాడు

మండల పరిధిలోని అల్లాడుపల్లె వీరభద్ర స్వామి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి నియామకానికి ఉన్నతాధికారుల నుండి ఉత్తర్వులు వెలువడ్డాయని ఆలయ ఇఒ శ్రీనివాసులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తిగల వారు 20 రోజుల్లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు కార్యాలయంలోగానీ, దేవదాయ శాఖ సిబ్బందినిగానీ సంప్రదించాలని తెలిపారు.

ఆర్‌జెయుపి విస్తృత సమావేశం

ప్రజాశక్తి - కడప అర్బన్

ఆర్‌జెయుపి రాష్ట్ర కమిటీ విస్తృత సమావేశం ఆదివారం ఉదయం 10 గంటలకు పసుపులేటి భుజంగరావు ఆర్‌జెయుపి టీచర్స్ హోంలో నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గునిశెట్టి శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఉపాధ్యాయులు, ఆర్‌జెయుపి కార్యకర్తలు సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రూ. 17 లక్షలతో ప్రహరీ నిర్మాణం

గాలివీడు : వెలిగల్లులో రూ.12 లక్షలతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించామని, మరో రూ.17 లక్షల వ్యయంతో ప్రహరీ నిర్మిస్తున్నామని సర్పంచ్ నఫీస్ పేర్కొన్నారు. శనివారం విలేకర్ల సమావేశంలో ఆమె మాట్లాడారు. 2008లో వెలిగల్లులో ముంపు గ్రామం కింద కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించారు. ఇప్పటికీ ఆ భవనం సమావేశాలకు ఉపయోగించుకుంటున్నారని చెప్పారు. ఇప్పటికే 90 శాతం పని పూర్తయినట్లు, రెండు మూడు రోజుల్లో ప్రహరీ నిర్మాణం పూర్తి చేయనున్నట్లు ఆమె తెలిపారు.

SRINIVASA INSITUTE OF MANAGEMENT
(Affiliated to JNTUA, Approved by AICTE) MADRAS ROAD, KADAPA – 516002
MBA SPOT AND MANAGEMENT ADMISSIONS ICET CODE: SIMP
Applications are invited from the eligible candidates for admission into MBA under Spot& Management Quota (Category-B) admissions for the Academic year 2023-24. Application can be obtained from the college office and filled in applications shall be submitted on or before 13-12-2023. Admission will be made as per the guidelines of Convener, APICET-2023 and APSCHE.
For Management seats contact: 9866719950, 9398979004